సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 21 । డిసెంబర్ । 2024



చలితో జర జాగ్రత్త!
పది రోజులుగా చలి తీవ్రత పెరుగుతుండగా, ఎండ వచ్చేవరకు ఎవరూ ఇంటి నుంచి బయటకు రావడంలేదు. 8లో



అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన
అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పలువురు ఆందోళన చేపట్టారు. 9లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
30° / 19°
జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం మంచు కురుస్తుంది. రాత్రి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వర్ణ కవచధారణలో రామయ్య...

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థాన అంతరాలయంలోని మూల మూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

రామయ్య నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ పీఆర్వో సాయిబాబా

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శుక్రవారం కొత్తగూడేనికి చెందిన కోడూరి రవికుమార్–స్వప్న దంపతులు రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పీఆర్వో సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్ర పుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అస్వస్థత.?

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అనంతారం గ్రామంలో ఉన్న ఐటీడీఏ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో కొందరు విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు శుక్రవారం ప్రచారం జరిగింది. పాఠశాలకు చెందిన విద్యార్థిని గురువారం రాత్రి వాంతులు, కీళ్ల నొప్పులతో అస్వస్థతకు గురికావడంతో ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడులో ఉన్న ఓ ఆస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లి వైద్యం చేయించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆశ్రమ పాఠశాలలోని మరికొందరు విద్యార్థినులు కూడా అస్వస్థతకు గురైనట్లు ప్రచారం జరిగింది. దీంతో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ ఘటనపై ఎంపీడీఓను వివరణ కోరగా.. ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగినట్లు ఫేక్ ప్రచారం జరిగిందని, విద్యార్థులు ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు.

అంతుచిక్కని పెద్దపులి జాడ..

కరకగూడెం: గడిచిన రెండు వారాల నుంచి మండల వాసులకు పెద్ద పులి భయం వెంటాడుతోంది. కొన్ని రోజుల కిందట మండలంలోని రఘునాథపాలెం అటవీ ప్రాంతంలో సంచరించి తిరిగి సరిహద్దు ములుగు జిల్లా తాడ్వాయి అటవీ ప్రాంతంలోకి వెళ్లిన పెద్దపులి తాజాగా మూడు రోజుల కిందట తిరిగొచ్చింది. అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు పలు గ్రామాల్లో డప్పు చాటింపు వేయించి సుమారు 10 రోజుల వరకు ప్రజలెవ్వరూ కూడా అటవీ ప్రాంతాల్లోకి వెళ్లొద్దని సూచించారు. పినపాక, కరకగూడెం మండలాల పరిధిలోని పలు అటవీ ప్రాంతాల్లో పులి జాడ కోసం నాలుగు బృందాలు ముమ్మరంగా అడవులను జల్లెడ పట్టాయి. శుక్రవారం మండలంలోని మోతె ఎర్రచెరువు సమీపంలో పులి పాదముద్రలను గ్రామస్తులు చూసినట్లు సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫారెస్ట్ సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించగా అవి పులి పాదముద్రలు కావని నిర్ధారించినట్లు మణుగూరు డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్ మక్సూద్ మొహినొద్దీన్ 'సాక్షి'కి తెలిపారు. పెద్ద పులి తిరిగి సరిహద్దు ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలంలోని బంధాల రిజర్వ్ ఫారెస్టులోకి వెళ్లినట్లు చెప్పారు. అక్కడి అటవీశాఖ అధికారులు కూడా పులి కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఆర్డినెన్స్‌తో కార్పొరేషన్?

రాష్ట్రంలో కొత్తగా రెండు కార్పొరేషన్ల ఏర్పాటు

- తాజా ప్రకటనలో కొత్తగూడేనికి దక్కని చోటు
- ఏర్పాటుకు అడ్డుగా స్థానిక పరిస్థితులు
- ఆర్డినెన్స్‌తో కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రణాళిక



కొత్తగూడెం పట్టణ వ్యూ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా రెండు కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. ఇందులో కొత్తగూడెం – పాల్వంచ మున్సిపాలిటీలను కలుపుతూ కార్పొరేషన్‌గా చేయాలనే ప్రతిపాదనకు చోటు దక్కలేదు. దీంతో కొత్తగూడెం కార్పొరేషన్ అవుతుందా లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కార్పొరేషన్ దిశగా..

జంట పట్టణాలుగా ఉన్న కొత్తగూడెం – పాల్వంచ మున్సిపాలిటీలు విలీనం చేస్తూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా కూనంనేని సాంబశివరావు గెలిచిన తర్వాత ఈ దిశగా అడుగులు వేగంగా పడ్డాయి. సీఎం రేవంత్‌రెడ్డికి స్వయంగా విజ్ఞప్తి చేయడంతోపాటు మున్సిపల్ ఆఫీసర్ల చేత ప్రత్యేకంగా సర్వే చేయించారు. ప్రాథమికంగా కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ మండలం పరిధిలోని పలు గ్రామాలను కలుపుతూ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయాలనే నిర్ణయానికి వచ్చారు.

అడ్డుగా ఏజెన్సీ చట్టాలు

కొత్తగూడెం కార్పొరేషన్ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉండగానే మహబూబ్‌నగర్, మంచిర్యాల మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీటితోపాటు కొత్తగూడెం కార్పొరేషన్ ప్రకటన రాకపోవడానికి స్థానికంగా ఉన్న ఏజెన్సీ చట్టాలు అడ్డుగా నిలిచినట్టు సమాచారం. మంచిర్యాల, మహబూబ్‌నగర్‌లు మైదాన ప్రాంతాలుగా ఉండటంతో కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయడం సులువైంది. అయితే ఇక్కడ పెసా, 1/70 చట్టాలు ఉండటంతో ఏ విధంగా కార్పొరేషన్ చేయాలనే అంశంపై ప్రభుత్వ వర్గాల మధ్య చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఈ చర్చలో ఓ నిర్ణయం కొలిక్కి రాకపోడంతో ప్రస్తుతానికి కొత్తగూడెం ప్రకటన వాయిదా పడినట్టు తెలుస్తోంది.

ఛత్తీస్‌గఢ్ తరహాలో..

దేశంలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఏజెన్సీ ఏరియాలో ఉన్న పట్టణాలను కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ చేశారు. పరిపాలనపరమైన సౌలభ్యం నిమిత్తం కార్పొరేషన్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆర్డినెన్స్‌ను ప్రభుత్వాలు రూపొందించాయి. ప్రస్తుతం ఆ రాష్ట్రాలు అవలంబించిన విధానాలను పరిశీలించి కొత్తగూడెం విషయంలో అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. తొలుత ఆర్డినెన్స్ జారీ చేసి, ఆరు నెలల్లోగా చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు సమయం పడుతుండటంతో ప్రస్తుతానికి కొత్తగూడెం విషయంలో ప్రకటన రాలేదని తెలుస్తోంది. మరోవైపు ఏజెన్సీ చట్టాలతో సంబంధం లేకుండా గ్రామీణ ప్రాంతాలను పూర్తిగా మినహాయించి కేవలం కొత్తగూడెం–పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రాంతాలను కార్పొరేషన్‌గా ముందుగా ప్రకటించాలనే ప్రతిపాదనను అధికారవర్గాలు పరిశీలిస్తున్నాయి.

ఆర్డినెన్స్‌తో సాకారం

కొత్తగూడెం–పాల్వంచ మున్సిపాలిటీ ప్రాంతాలనే కలుపుతూ కార్పొరేషన్‌గా చేస్తే భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ఆ నగర పాలికకు అసంపూర్ణంగానే మిగిలిపోతుందనే భావన ప్రభుత్వ వర్గాల్లో ఉంది. దీంతో ఈ రెండు పట్టణ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల పరిధిలో ఇప్పటికే పట్టణంలో కలిసిపోయిన ఏరియాలను కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువస్తూ ప్రత్యేకంగా ఆర్డినెన్స్‌ను జారీ చేయాలనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే మున్సిపాలిటీలు, 35గ్రామాలు కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోకి వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. అప్పుడు జనాభా 2.67 లక్షలకు చేరుకునే అవకాశముంది.

ప్రభుత్వంపై విశ్వాసం ఉంది

ఏజెన్సీ ఏరియాల్లో ఉన్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెం కార్పొరేషన్, ములుగు మున్సిపాలిటీలకు సంబంధించి ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువస్తామని ప్రభుత్వం నుంచి హామీ లభించింది. త్వరలోనే కొత్తగూడేన్ని కార్పొరేషన్‌గా ప్రకటిస్తారనే సంపూర్ణ విశ్వాసం ఉంది.
–కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

'పేట' ఇక మున్సిపాలిటీ..

- అసెంబ్లీలో మున్సిపల్ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపాదన, ఆమోదం
- విలీనం కానున్న అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు
- అశ్వారావుపేటతో జిల్లాలో ఐదుకు చేరిన పురపాలికలు



అశ్వారావుపేటలోని ప్రధాన కూడలి

అశ్వారావుపేట: దాదాపు పదేళ్లుగా సస్పెన్స్‌లో ఉన్న అశ్వారావుపేట మున్సిపాలిటీ కార్యరూపం దాల్చింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం నవతెలంగాణ నిర్మాణంలో భాగంగా కొత్త జిల్లాలు, కొత్త మండలాలు, మున్సిపాలిటీల ఏర్పాటుకు అప్పటి సర్కార్ ముందుకు వచ్చినా నాటి పాలకులు, నాయకులు అశ్వారావుపేట మున్సిపాలిటీ ప్రతిపాదనను తోసిపుచ్చారు. దీంతో దశాబ్దం వెనక్కు పోయిన అశ్వారావుపేట మున్సిపాలిటీ ప్రతిపాదన ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఊపిరి పోసుకుంది. పేటను మున్సిపాలిటీగా మార్చాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీ రామారావు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం మారిన తర్వాత నూతన మున్సిపాలిటీగా అశ్వారావుపేటకు తిరిగి ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు కానున్న 12 మున్సిపాలిటీల్లో అశ్వారావుపేట ఒకటిగా మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీలో ప్రకటించారు. ఇప్పటివరకు ఊహాగానాల్లో ఉన్న అశ్వారావుపేట మున్సిపాలిటీ ప్రకటనకు నోచుకుంది. ఆదేశాలు, మార్గదర్శకాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

కాగా జిల్లాలో ఇప్పటికే కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు నాలుగు మున్సిపాలిటీలు ఉండగా, అశ్వారావుపేటతో ఆ సంఖ్య ఐదుకు చేరనుంది.

మూడు పంచాయతీలతో..

అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు గ్రామపంచాయతీలను విలీనం చేస్తూ అశ్వారావుపేట మున్సిపాలిటీ ఏర్పాటు కానుంది. ఇందుకోసం అన్ని ప్రతిపాదనలను గత ప్రభుత్వమే సేకరించింది. అశ్వారావుపేట మేజర్ పంచాయతీలో సుమారు 23వేల జనాభా, సుమారు రూ.8.5 కోట్ల ఆదాయం, పేరాయిగూడెం గ్రామపంచాయతీలో సుమారు 8వేల జనాభా, ఆదాయం సుమారు 3కోట్లు, గుర్రాలచెరువు గ్రామపంచాయతీలో సుమారు 1248 జనాభా, రూ. 53 లక్షల ఆదాయం ఉంది. ఇవి రెండు అశ్వారావుపేట మేజర్ పంచాయతీ నుంచి వేరు పడినవే. అశ్వారావుపేట మున్సిపాలిటీగా మార్చుతుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఇంట్లో డ్వాక్రా గ్రూపు సభ్యురాలు ఉండాలి

డీఆర్‌డీఓ విద్యా చందన



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విద్యాచందన

చుంచుపల్లి: జిల్లాలో ప్రతి ఇంట్లో ఓ మహిళ తప్పనిసరిగా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలై ఉండాలని డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సెర్ప్ కార్యక్రమాలపై ఏపీఎంలు, సీసీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతి మహిళా సంఘం అభివృద్ధి చెందేలా వ్యాపార అంశాలపై చైతన్యం కల్పించాలన్నారు. ఏపీఎంలు, సీసీలు వారి నెలవారి లక్ష్యాలను 100 శాతం సాధించాలని ఆదేశించారు. అదనపు డీఆర్‌డీఓ నీలేష్, శ్రీనిధి రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ , డీపీఎంలు, ఏపీఎంలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోవాలి

- సిబ్బంది, వైద్యులపై కలెక్టర్ జితేష్ ఆగ్రహం
- మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ




బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంరూరల్: మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) సిబ్బంది, వైద్యులు పనితీరు మార్చుకోవాలని, లేకపోతే పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. శుక్రవారం ఆయన రామవరంలోని ఎంసీహెచ్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. మందులు బయటకు రాస్తున్నారని, టీ హబ్‌కు టెస్ట్ శాంపిల్స్‌ను పంపకుండా, టెస్టులు బయట చేయించుకోవాలంటున్నారని పారాసిటమాల్ సిరప్, చిన్న చిన్న మాత్రలు కూడా లేవంటున్నారని, ఎక్స్ రే కూడా పనిచేయడం లేదని వాపోయారు. ఫిర్యాదు చేయాలంటే నంబరు పనిచేయడం లేదని, పనిచేసే నంబరు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో కలెక్టర్ ఆస్పత్రి సిబ్బంది, వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే ఆఖరి అవకాశమని స్పష్టం చేశారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో మందులు ఉన్నా బయటకు ఎందుకు రాస్తున్నారని ప్రశ్నించారు. ఇండెంట్ ఎందుకు పెట్టలేదని కింది స్థాయి ఉద్యోగులను ఆస్పత్రి సూపరింటెండెంట్ రాధామోహన్ అడుగుతుండగా, మీరు ఇక్కడ ఉంటున్నారా హైదరాబాద్‌లో ఉంటున్నారా అంటూ సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో నియంత్రణకు, పర్యవేక్షణకు మరో అధికారిని నియమించాల్సి ఉంటుందని అన్నారు. అనంతరం ఎంసీహెచ్‌లో ఏర్పాటు చేసిన తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ప్రారంభించారు. ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారానే జన్యుపరమైన రుగ్మతలను గుర్తించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, ఇతర వైద్యాధికారులు రవిబాబు విజయలక్ష్మి, బాలాజీ, చైతన్య, మధువరన్, స్పందన పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ వీసీకి హాజరైన కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆకాంక్షిత జిల్లా కలెక్టర్లతో నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం ఢిల్లీ నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ స్థానిక అధికారులతో మాట్లాడుతూ ఆకాంక్షిత మండలమైన గుండాలలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల పురోగతిపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీపీఓ సంజీవరావు, యాస్పిరేషన్ బ్లాగ్ ప్రోగ్రామ్ ఫెలో నవనీత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

చండ్రుగొండ: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమశాతాన్ని ఆయన పరిశీలించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవని ధాన్యం కాటాలు త్వరితగతిన చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. కాగా, కొనుగోలు కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, కీసరి కిరణ్ రెడ్డి అదనపు కలెక్టర్‌ను కోరారు. గోదాంల ప్రాంగణంలో ఉన్న జామాయిల్ ఇతర చెట్లను తొలగిస్తే రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. అనంతరం తిప్పనపల్లిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అదనపు కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్‌ఐ అక్బర్, కాంగ్రెస్ నాయకులు ఫజల్‌బీ, సీహెచ్ లక్ష్మణ్‌రావు, దారం గోవిందరెడ్డి పాల్గొన్నారు.

వైద్యాధికారుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: జిల్లాలోని ఆళ్లపల్లి, దమ్మపేట మాతా శిశు ఆరోగ్య అండ్ ఎపిడమిక్ బృందంలో వైద్యాధికారి ఖాళీలను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు, గిరిజన ప్రాంతంలో పనిచేసిన అనుభవం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఏడాదిపాటు పనిచేయాలని, నెలకు రూ.52 వేల వేతనం చెల్లిస్తామని, అర్హులు ఈ నెల 27వ తేదీలోపు భద్రాచలం ఐటీడీఏలో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

అమిత్ షా వ్యాఖ్యలు సహించరానివి

- మనువాదం అమలు చేయాలన్నదే బీజేపీ కుట్ర
- ఆ క్రమంలోనే అంబేద్కర్‌పై అవాకులు, చెవాకులు
- సీఎం ఆరు గ్యారంటీలను అమలు చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- ఇల్లెందులో ప్రారంభమైన పార్టీ జిల్లా మహాసభలు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

ఇల్లెందు: రెండు రోజులుగా దేశంలో ఒక తీవ్రమైన చర్చ జరుగుతోందని, పార్లమెంటు సాక్షిగా యావత్ దేశ ప్రజలు దేవునిగా కొలిచే అంబేద్కర్‌ను ద్వేషించి బీజేపీ అగ్రనేత అమిత్‌షా అవాకులు చెవాకులు పేలడం సహించరానిదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని 24 ఏరియా సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో సీపీఎం దివంగత నేత దేవులపల్లి యాకయ్య నగర్‌లో జరుగుతున్న సీపీఎం జిల్లా మహాసభల్లో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. అంబేద్కర్‌ను అమిత్ షా పథకం ప్రకారమే అన్నారని, బీజేపీ సిద్ధాంతంలోనే ద్వేషం ఉందని ఆరోపించారు. బీజేపీ సిద్ధాంతంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి లేదని, రాజ్యాంగాన్ని తొలగించాలన్నదే బీజేపీ కుట్ర అని విమర్శించారు. ప్రజలకు హక్కులు ఉండటం బీజేపీకి ఇష్టం ఉండదని, మనుధర్మ శాస్త్రం అమలు చేయాలన్నదే బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలను కులాలు, మతాలుగా విభజన చేయటమే వారి అభిమతమని అన్నారు. అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టామని, బీజేపీయేతర పక్షాలు కూడా కలిసిరావాలని కోరారు. అమిత్ షాకు వ్యతిరేకంగా సాగే ఆందోళనకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం వహించాలని, తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు.

మైనారిటీలపై దాడులు పెరిగాయి..

దేశంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చాక మైనారిటీలపై దాడులు తీవ్రమయ్యాయని అన్నారు. జమిలి ఎన్నికలతో ప్రజాస్వామ్యం, ఫెడరల్ వ్యవస్థ నాశనం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతీయ పార్టీలు తుడిచి పెట్టుకు పోతాయన్నారు. బీజేపీని అధికారంలోకి రాకుండా ఉండాలనే తాము కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని, 302 సీట్ల నుంచి 240 సీట్లకు బీజేపీ బలం పడిపోయేలా సీపీఎం ఇతర వామపక్షాలు పాటుపడ్డాయని వివరించారు.

అదానీతో రేవంత్ రహస్య ఒప్పందం!

పార్లమెంటులో రాహుల్ అదానీకి వ్యతిరేకంగా పోరాడుతుంటే రాష్ట్రంలో అదే కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి అదానీతో రహస్య ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. స్కిల్ యూనివర్సిటీ టెండర్లు కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా హైడ్రా, మూసీ, ఫ్యూచర్ సిటీ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. కమ్యూనిస్టులకు ఓట్లు సీట్లు గీటురాయి కాదని స్పష్టం చేశారు.



జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

వామపక్షాలు తప్ప ఎంపీ, ఎమ్మెల్యేలున్న పార్టీలు కూడా లగచర్లలో ఏం సాధించలేకపోయాయని ఎద్దేవా చేశారు. మహాసభలో ఆహ్వానం సంఘం గౌరవాధ్యక్షుడు పి.సోమయ్య, సీపీఎం రాష్ట్ర నాయకుడు పి. సుదర్శన్‌రావు, బి.వెంకట్, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, పిట్టల రవి, బ్రహ్మాచారి, నబీ, శ్రీధర్, శ్రీను, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాచర్ల భారతి, కుంట ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. మహాసభలకు ముందు పట్టణంలో ఎర్రదండు ప్రదర్శన నిర్వహించారు. సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య జెండా ఆవిష్కరించారు. అమరవీరులకు నివాళులు అర్పించగా సుమారు 500 మంది ప్రతినిధులు సభలకు హాజరయ్యారు.

హోరాహోరీగా క్రీడాపోటీలు

రెండో రోజూ ఉత్సాహంగా సాగిన గురుకులాల రాష్ట్రస్థాయి పోటీలు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పాల్వంచరూరల్: రాష్ట్రస్థాయి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలల క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మండలంలోని లక్ష్మీదేవిపల్లి గురుకులంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో శుక్రవారం పలు జట్లు ఫైనల్స్‌కు చేరాయి. అండర్–17 విభాగంలో వాలీబాల్ పోటీల్లో జోన్–2, జోన్–7 జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. అండర్–19 విభాగం కబడ్డీ పోటీల్లో జోన్–7, జోన్–4 జట్లు, అండర్–17 విభాగం ఖోఖో పోటీల్లో జోన్–1, జోన్–4 జట్లు, అండర్ 19 విభాగంలో జోన్–1, జోన్–3 జట్లు, హ్యాండ్‌బాల్ పోటీల్లో జోన్–1, జోన్–5 జట్లు, అండర్–19 విభాగంలో జోన్–4, జోన్–6 జట్లు, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జోన్–1, జోన్–5 జట్లు, టెన్నికాయిట్ పోటీల్లో జోన్–4, జోన్–3 జట్లు ఫైనల్స్‌కు చేరినట్లు నిర్వాహకులు తెలిపారు.

విజేతలు

క్యారమ్స్ పోటీల్లో జోన్–2 జట్టు ప్రథమ, టెన్నికాయిట్‌లో జోన్–3 ప్రథమ, జోన్–4 ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్–14 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో ఎ.విశాల్ ప్రథమ, ఎం.నితిన్ ద్వితీయ, పి.రాకేష్ తృతీయ, లాంగ్‌జంప్ పోటీల్లో సీహెచ్.నితిన్ ప్రథమ, టి.చరణ్ ద్వితీయ, ఎం ప్రవీణ్ తృతీయ, షాట్‌పుట్‌లో శివరాజ్ ప్రథమ, కె.ఆనంద్ ద్వితీయ, కె.సంకేత్ తృతీయ స్థానాలు సాధించారు.

అండర్–17 విభాగంలో

లాంగ్ జంప్‌లో కె.ప్రవీణ్ ప్రథమ, కె.ఆనంద్ ద్వితీయ, జి.అనిల్ తృతీయ, 5 వేల మీటర్ల పరుగు పందెంలో ఎ.భద్రూనాయక్ ప్రథమ, జె.గౌతమ్ ద్వితీయ, వి.బన్ని తృతీయ స్థానాల్లో నిలిచారు.

అండర్–19 విభాగంలో

షాట్‌పుట్‌లో పి.అరవింద్ ప్రథమ, సిద్ధార్థ ద్వితీయ, ఎ.గణేష్ తృతీయ, లాంగ్ జంప్‌లో ఎ.గణేష్ ప్రథమ, కె.ఉదయ్‌కిరణ్ ద్వితీయ, డి.గణేష్ తృతీయ, 5 వేల మీటర్ల పరుగు పందెంలో జి.శివకుమార్ ప్రథమ, పి.గోపిచంద్ ద్వితీయ, సి.సునీల్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ సక్రు నాయక్, మల్టీజోనల్ అధికారి అలివేలు, స్పోర్ట్స్ మీట్ ఇన్‌చార్జి సట్ల శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు.

క్లుప్తంగా

వైద్యులకు కలెక్టర్ అభినందన


శిశువుకు చికిత్స అందిస్తున్న వైద్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియాస్పత్రి వైద్యులను శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అభినందించారు. చర్ల మండలం రాళ్ల పురం గ్రామానికి చెందిన 39 ఏళ్ల కుంజం ముయ్యమ్మకు నెలలు నిండటంతో ఆమె బంధువులు ఈ నెల 11న భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకి దాదాపు 9 సార్లు మూర్ఛ రావడంతోపాటు అధిక రక్తపోటుతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఎన్ని మందులు వాడినా స్పృహలోకి రాకపోవడంతో ఆపరేషన్ చేసి కడుపులోని బిడ్డను బయటకు తీయగా.. ఎలాంటి చలనం లేకపోడంతో వైద్యులు శ్రమించి.. బిడ్డకు ప్రాణం పోశారు. వారం పాటు ముయ్యమ్మను ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి వైద్యం అందించగా ఆమె కోలుకుంది. దీంతో తల్లీబిడ్డలను ఇంటికి పంపించారు. కాగా, వైద్యులు ప్రమీల, సాత్విక, నిఖిత, మౌనిక, విజయరావుతో పాటు భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణను జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అభినందించారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

దుమ్ముగూడెం: సీఎం కప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు మండలానికి చెందిన వెంకటేశ్వర్లు (బన్నీ), పూనెం బిందు ఎంపికయ్యారని జిల్లా కరాటే అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఇంద్రాల శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆటగాళ్లను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక


హర్షిత్‌ను అభినందిస్తున్న తిరుమల్‌రావు

పాల్వంచ: అథ్లెటిక్స్ పోటీల్లో అంగవైకల్యాన్ని అధిగమించిన హర్షిత్.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం కొత్తగూడెంలోని పారా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్వంచకు చెందిన స్టార్ చిల్డ్రన్స్ స్కూల్ 8వ తరగతి విద్యార్థి హర్షిత్ 100, 200 మీటర్ల పరుగుపందెంలో సత్తా చాటి.. వచ్చే నెల 4, 5 తేదీల్లో గచ్చిబౌలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని జిల్లా సీఎం కప్ కన్వీనర్ తిరుమల్‌రావు, పీఈటీలు, తల్లిదండ్రులు వీరబ్రహ్మేందర్, ఉమా అభినందించారు.

టీచర్లు లేకపోవడంతో విద్యార్థుల నిరసన


ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పాల్వంచ: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యాబోధన చేసే టీచర్లు లేకపోవడంతో శుక్రవారం విద్యార్థులు నిరసన తెలిపారు. వారికి ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. టీచర్లు లేకపోవడంతో తరగతులు జరగడం లేదన్నారు. టీచర్లు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం స్పందించాలని, పాఠశాలల్లో టీచర్లు లేక చదువులు ఆగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వరక అజిత్, గుండాల సుజన్, మోటా రాజు, పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణి'మహిళలకు ఆటల పోటీలు


ఆటల పోటీలు ప్రారంభిస్తున్న హరిణి, సునీత తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డే సందర్భంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మహిళలకు శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను డి.హరిణి సత్యనారాయణరావు, జి.సునీతా వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. అనంతరం పాసింగ్ దబాల్, మ్యూజికల్ చైర్, బాంబ్ ఇన్ సిటీ తదితర పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనగా, విజేతలకు ఈ నెల 23న బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం రాజేంద్రప్రసాద్, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావు, సేవా కోఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, సేవా సెక్రటరీ సుజాత పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

చలితో జర జాగ్రత్త!


ఆస్పత్రిలో చికిత్స కోసం వేచి ఉన్న బాధితులు

- రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత
- జలుబు, జ్వరం, చర్మవ్యాధుల బారిన ప్రజలు
- రక్షణ నియమాలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు

ఇల్లెందురూరల్: గడిచిన పది రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. దీంతో ఎండ వచ్చేవరకు ఎవరూ ఇంటి నుంచి బయటకు రావడంలేదు. అయినా చలి ప్రభావంతో ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రధానంగా జ్వరం, జలుబు, దగ్గు, గొంతునొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, న్యూమోనియా, చర్మ సంబంధ వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరుతున్నారు. కాగా చలి నుంచి రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య సహాయం పొందాలని నిపుణులు సూచిస్తున్నారు.

జలుబు, జ్వరం, దగ్గు..

చలితో చిన్నారులకు జ్వరంతోపాటు చర్మంపై దద్దుర్లు, చిన్నచిన్న కురుపులు వంటి సమస్యలు వస్తున్నాయి. జలుబు, దగ్గు, అస్తమాకు గురవుతున్నారు. వృద్ధుల్లో చర్మం త్వరగా పొడిబారుతుంది. ఉసిరిక, సోరియాసిస్ ఉన్న వాళ్లలో చర్మవ్యాధులు అధికమవుతాయి. వెచ్చదనం కోసం చలిమంట వద్ద, ఎండ వేడిమికి అత్యధిక సమయం గడిపినా ఆరోగ్య సమస్యలు వస్తాయి.

చలిలో తిరగొద్దు..

చలికాలంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో చిన్నారులు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. చలికి ఎండలో కూర్చునేవారు... తీవ్రత పెరిగినపుడు కూడా ఎండలోనే ఉంటే అనారోగ్యానికి గురవుతారని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులను ఉదయం, సాయంత్రం బయట తిరగకుండా చూడాలి. ఈదురు గాలులు వచ్చిన సమయంలో అప్రమత్తంగా ఉండాలి. వేడి, వేడి ఆహార పదార్థాలు మాత్రమే ఇవ్వాలి. ఇంటి బయట తినుబండారాలకు దూరంగా ఉండాలి. చిన్నారులకు ఐస్‌క్రీమ్, ఫ్రిజ్‌లో పెట్టిన ఆహార పదార్థాలు, కూల్‌డ్రింక్‌లు ఇవ్వొద్దు. గోరువెచ్చని నీటిని మాత్రమే తాగించాలి. అత్యవసరమైతే బయటకు వెళ్లే సమయంలో చలికి రక్షణగా ఉన్ని దుస్తులు ధరించాలి. తలకు ఉన్నితో తయారు చేసిన టోపీ, చేతులకు గ్లౌజ్‌లను ధరింపచేయాలి. ఇంట్లోని పెంపుడు జంతువులకు దూరంగా ఉండాలి. చలి తీవ్రత కారణంగా శరీరం పొడిబారకుండా నూనెలను, పలు రకాలైన లోషన్లను శరీరానికి పట్టించాలి.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి


ఆస్పత్రులు కిటకిట

శీతాకాలంలో వచ్చే వ్యాధులతో ప్రజలు సమీపంలోని నిపుణులైన వైద్యుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వీరిలో జ్వరం, జలుబు, దగ్గు, చర్మవ్యాధుల బాధితులే ఉంటున్నారు. పెద్దవారి కంటే వృద్ధులు, 15ఏళ్లలోపు పిల్లలు అత్యధికులు కనిపిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చలి బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

వేడినీటితో స్నానం చేయించాలి


చిన్నారుల వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకరి నుంచి మరొకరికి వైరస్ వ్యాపించి జలుబు, దగ్గు, జ్వరాలు వస్తుంటాయి. బెడ్‌షీట్లు, దిండు కవర్లు, కర్టెన్లు తరచూ మార్చాలి. పిల్లలకు చల్లని ఆహార పదార్థాలు ఇవ్వొద్దు. వేడినీటితో స్నానం చేయించాలి. చర్మ సమస్యలు రాకుండా చేతులు, కాళ్లకు లోషన్, నూనె పట్టించాలి.

–డాక్టర్ మోతీలాల్, పిల్లలవైద్య నిపుణుడు, ఇల్లెందు

అశ్రద్ధ చేయొద్దు


చలికాలంలో ఆరోగ్య సమస్యల పట్ల అశ్రద్ధ చేయొద్దు. ఈ సమయంలో ఆస్తమాతోపాటు చర్మసంబంధ వ్యాధులు ప్రబలుతుంటాయి. ప్రధానంగా చలి తీవ్రతకు చర్మం పగిలి మరింత ఇబ్బంది పెడుతుంది. రక్షణగా తలకు, చేతులకు ఉన్ని దుస్తులు ధరించాలి. కాళ్లకు షూ వినియోగిస్తే మంచిది. చిన్నారులు గురక పెట్టినా, ముక్కు కారుతున్నా వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి.

– డాక్టర్ కవిత, వైద్యాధికారి, రొంపేడు పీహెచ్‌సీ

ఏ స్థాయిలోనైనా సత్తా చాటుతాం..

పలు క్రీడల్లో బంగారు పతక విజేతల మనోగతం

లక్ష్మీదేవిపల్లిలో రెండు రోజులుగా కొనసాగుతున్న రాష్ట్రస్థాయి గురుకుల స్పోర్ట్స్ మీట్‌లో గేమ్ చేంజర్లుగా మారిన జాతీయస్థాయి క్రీడాకారులు.. బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఒలింపిక్ క్రీడల్లో పాల్గొనాలనేదే తమ లక్ష్యమని చెబుతున్నారు. –పాల్వంచరూరల్

ఒలింపిక్స్ ఆడాలని ఉంది


లాంగ్‌జంప్ క్రీడలో మూడు సార్లు జాతీయస్థాయిలో పాల్గొని మూడు పతకాలు సాధించాను. అంతర్జాతీయ స్థాయిలో ఆడి ఒలింపిక్స్‌లో ఆడాలని ఉంది. అందు కోసం కృషి చేస్తున్నాను. సంక్షేమ గురుకులాల్లో క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యత వల్ల నా భవిష్యత్ గొప్పగా ఉంటుందనుకుంటున్నా.

– కిన్నెర ఆనంద్, అన్నపురెడ్డిపల్లి గురుకుల పాఠశాల

ఐపీఎస్ అవుతాను..


వనపర్తి జిల్లా మదనాపురంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం బాలుర కళాశాల నుంచి వచ్చాను. రేస్‌వాక్, ఐదు వేల మీటర్ల పరుగుపందెంలో మూడుసార్లు జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించాను. క్రీడల్లో ప్రతిభ చూపి అంతర్జాతీయస్థాయిలో ఆడాలని ఉంది. గేమ్స్ కోటాలో ఐపీఎస్ కావాలనే ఆశ ఉంది.

– అంగోతు భద్రూనాయక్, మదనాపురం, వనపర్తి జిల్లా

ఆర్మీలో చేరాలని ఉంది


రాష్ట్రస్థాయి పోటీలకు నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల నుంచి వచ్చాను. స్కూల్ గేమ్స్, ఫెడరేషన్, అసోసియేషన్ తరఫున మూడుసార్లు జాతీయస్థాయిలో ఆడాను. రెండువేల మీటర్ల క్రాస్ కంట్రీలో బహుమతులను సాధించాను. చదువు పూర్తి కాగానే ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలనుంది.

– దొడ్డ సంతోష్‌కుమార్, లింగాల గురుకులం, నాగర్‌కర్నూల్ జిల్లా

రాష్ట్రానికి పేరు తీసుకొస్తా..


డిస్కస్‌త్రో క్రీడలో జాతీయస్థాయిలో పాల్గొని ఐదు పతకాలు సాధించాను. ఆదిలాబాద్ నుంచి అంతర్జాతీయ వేదికల మీద ఆడి రాష్ట్రానికి పేరు తీసుకొచ్చే క్రీడాకారుడిగా ఎదుగుతాను. మా ప్రిన్సిపాల్ ప్రోత్సాహంతో పాటు గురుకులంలో ఇస్తున్న ప్రత్యేక శిక్షణ నాకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– కారేవార్ సంకేత్, కాసిపేట గురుకుల పాఠశాల, మంచిర్యాల జిల్లా

ఆర్మీలో ఉద్యోగం సాధిస్తా..


జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని 21 కిలోమీటర్ల వాకింగ్, 1,600 మీటర్ల పరుగుపందెంలో మూడుసార్లు బంగారు పతకం సాధించాను. సంక్షేమ గురుకులంలో చదువుకుంటూ ప్రత్యేక శిక్షణ పొందుతున్నా. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చూపి భవిష్యత్‌లో ఆర్మీలో ఉద్యోగం సాధిస్తా. అందుకోసం పట్టుదలతో కృషి చేస్తున్నాను.

– పిత్రియ కేదార్‌సింగ్, ఉప్పలవాయి గురుకుల పాఠశాల, కామారెడ్డి జిల్లా

కిడ్నీ బాధితులకు మెరుగైన వైద్యం

సాక్షి ఎఫెక్ట్..

జూలూరుపాడు: కిడ్నీ బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని డీఎంహెచ్‌ఓ ఎల్.భాస్కర్‌నాయక్ స్పష్టం చేశారు. ఈ నెల 19న 'సాక్షి'లో ప్రచురితమైన 'ఒక్కొక్కరినీ కబళిస్తోంది'అనే శీర్షికతో వెలువడిన కథనానికి స్పందించిన డీఎంహెచ్‌ఓ శుక్రవారం అనంతారం గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి కిడ్నీ బాధితులను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి, ఆహారపు అలవాట్లపై ఆరా తీశారు. ఆర్‌ఎంపీల వద్ద వైద్యం పొందిన వారి గురించి అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రమైన నీరు తాగాలని, మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. మద్యపానం, ధూమపానం, గుట్కా తినడం లాంటి అలవాట్లను మానేయాలన్నారు. కిడ్నీ బాధితులు, అనుమానితుల రక్త నమూనాలను వైద్యసిబ్బంది సేకరిస్తున్నారని, తాగునీటి నమూనాలను వరంగల్ ల్యాబ్‌కు పంపిస్తామని చెప్పారు. ప్రజలు గ్రామీణ వైద్యులను ఆశ్రయించొద్దని, గ్రామీణవైద్యులు స్థాయికి మించి వైద్యసేవలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ బాలాజీనాయక్, డాక్టర్ మధువరుణ్, బి.వెంకటేశ్వర్లు, ఎం.రామకృష్ణ, సావిత్రి, పూనెం ఝాన్సీ పాల్గొన్నారు.


కిడ్నీ బాధితుడితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

రశీదులు భద్రంగా ఉంచుకోవాలి

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): పంటకాలం పూర్తియ్యేవరకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాల రశీదులను భద్రంగా ఉంచుకోవాలని రైతులకు డీఏఓ బాబూరావు సూచించారు. మండల కేంద్రంలోని పలు పురుగుమందులు, విత్తనాల షాపులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్లుకు పలు సూచనలు చేశారు. స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు డీబీటీల్లో పొందుపర్చాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏడీఏ రవికుమార్, అనూష పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ బాబూరావు

నాలుగు కేజీల గంజాయి పట్టివేత

కొత్తగూడెంఅర్బన్: ఆంధ్రప్రదేశ్ నుంచి కొత్తగూడెం మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్న నాలుగు కేజీల గంజాయిని త్రీటౌన్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. త్రీటౌన్ సీఐ శివప్రసాద్ కథనం ప్రకారం.. ఎస్‌ఐ విజయలక్ష్మి సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్ ఏరియాలో తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ముగ్గురు అనుమానితులను గుర్తించి తనిఖీ చేయగా నాలుగు కేజీల గంజాయి దొరికింది. ఆంధ్రప్రదేశ్‌లోని డొంకరాయి నుంచి తీసుకొచ్చిన గంజాయిని హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నట్లు గజ్వేల్‌కు చెందిన శ్రీనివాస్, బాలు, డొంకరాయికి చెందిన లక్ష్మణ్.. విచారణలో తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

పాల్వంచ: స్కూటీపై గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం పట్టణ అదనపు ఎస్‌ఐ రాఘవయ్య ఆధ్వర్యంలో బీసీఎం రోడ్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. భద్రాచలం వైపు నుంచి పాల్వంచ వైపు స్కూటీపై వస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. అతని వద్ద 6.7 కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చెందిన ముద్దమల్ల శేషుగా గుర్తించి, అమ్మిన వ్యక్తితోపాటు హైదరాబాద్‌లో ఉండే మరో ఇద్దరిపై ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

జూలూరుపాడు: మండల కేంద్రంలోని పాపకొల్లు క్రాస్ రోడ్డులో గల కిరణా దుకాణంలో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టి.. రూ.2,500 విలువ గల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. దుకాణం నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు జూలూరుపాడు ఎస్‌ఐ బాదావత్ రవి తెలిపారు.

హత్య కేసులో 15 మందికి జైలు

కొత్తగూడెంఅర్బన్: హత్య కేసులో 15మందికి జైలు శిక్ష విధిస్తూ భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.. 2014 సెప్టెంబర్ 8న గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఇల్లెందు 24 ఏరియాకు చెందిన పులిపాటి లోకేశ్ తనకు చెల్లె అయ్యే యువతిని అవినాష్ ప్రేమిస్తున్నాడని వార్నింగ్ ఇచ్చేందుకు షేక్ ఆరిఫ్, నీలమర్రి నాగరాజు, దేవరపల్లి జితేందర్‌రెడ్డి, ఏలుగు సమంత్, తాళ్లపల్లి వంశీ, బండి శ్రీకాంత్, కరకపల్లి ప్రేమ్‌కుమార్, ఎట్టి వెంకటేశ్వర్లు, దడిగల నరేశ్, ఎడారి సంపత్, చింతలచెరువు రఘు, కుండోజు రాజు, బోశాల ఉదయ్‌కుమార్, సూరపాక గౌతమ్‌ను పిలిపించాడు. వీరంతా అవినాష్‌తో యువతికి జోలికిరానని ప్రమాణం చేయించారు. అదే సమయాన వారి మధ్య తగాదా జరగగా దాడులు చేసుకున్నారు. దీంతో దండు శ్రీను తదితరులు చేరుకుని అందరినీ పంపించారు. ఈమేరకు నాగరాజు, సమంత్ ఇచ్చిన సమాచారంతో వారంతా ఆయుధాలతో వచ్చి శ్రీనుసహా ఐదుగురి పై దాడి చేయగా అప్పటి ఎస్సై బి.అశోక్ కేసు నమోదు చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీను చికిత్స పొందుతూ 2017లో మృతి చెందగా ఆనాటి సీఐలు ఎస్.రమేశ్, ఏ.నరేందర్ కేసు నమో దు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈమేరకు విచారణలో 15 మందిపై నేరం రుజువు కావడంతో ఆరిఫ్, నాగరాజు, దేవరపల్లి జితేందర్ రెడ్డి, ఎలుగు సమంత్, పులిపాటి లోకేశ్, తాళ్లపల్లి వంశీ, బండి శ్రీకాంత్, కాకరపల్లి ప్రేమ్‌కుమార్, ఎట్టి వెంకటేశ్వర్లు, దడిగల నరేశ్, ఎడారి సంపత్, చింతలచెరువు రఘు, కుండోజు రాజు, బోశాల ఉదయ్‌కుమార్, సూరపాక గౌతమ్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ లక్ష్మి వాదించగా ఎస్సై ప్రవీణ్‌తో పాటు ఎస్.వీరబాబు, శ్రీనివాస్ తదితరులు విచారణకు సహకరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా బోధన సిబ్బంది నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత కోర్సు ల్లో సాధించిన మార్కులు, డెమో ఆధారంగా ఎంపిక ఉంటుందని వెల్లడించారు. కెమిస్ట్రీ బోధనకు ఆరుగురు, ఫిజిక్స్ ఒకరితో పాటు నలుగురు స్టూడెంట్ కౌన్సిలర్లను నియమించనున్నట్లు తెలిపారు. ఆయా కోర్సుల్లో 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించి బీఈడీ పూర్తిచేయడమే కాక సీటీఈటీ, టెట్ పాసై ఉండాలని వెల్లడించారు. స్టూడెంట్ కౌన్సిలర్ పోస్టులకు సైకాలజీలో పీజీ లేదా గుర్తింపు ఉన్న యూనివర్సిటీ నుంచి గైడెన్స్, కౌన్సెలింగ్‌లో డిప్లొమా చేసి జాతీయస్థాయిలో ఏడాది అనుభవం కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన వారు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని, వివరాల కోసం పనిదినాల్లో 80743 35630 నంబర్ ద్వారా సంప్రదించాలని పీఓ సూచించారు.

చిన్నారి మృతిపై విచారణ


వివరాలు సేకరిస్తున్న డాక్టర్ లోహిత

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామంలో ఆరు నెలల చిన్నారి రుషిక మృతిపై పీహెచ్‌సీ వైద్యాధికారి లోహిత శుక్రవారం విచారణ చేపట్టారు. చిన్నారి మృతికి సంబంధించిన కారణాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా చిన్నారికి ఏర్పడిన అనారోగ్యం, అనంతరం ఆస్పత్రుల్లో అందించిన చికిత్సపై ఆరా తీశారు. సేకరించిన వివరాల ఆధారంగా నిమ్ము, లేదా ఫిట్స్‌తో మృతి చెంది ఉంటుందని వైద్యాధికారి అంచనా వేశారు. పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డాక్టర్ లోహిత తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శివారు జామాయిల్ తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.52 వేల నగదు, 6 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

ప్రెజర్‌బాంబు పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు ఏర్పాటుచేసిన ప్రెజర్‌బాంబు పేలగా ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ ప్రాంతం నారాయణపూర్ జిల్లా కెచ్చాపాల్ టోరే మార్గంలో రహదారి నిర్మిస్తుండగా భద్రత కోసం జవాన్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ ప్రాంతంలో మావోలు అమర్చిన ప్రెజర్‌బాంబును గుర్తించని జవాన్లు తొక్కడంతో పేలగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మూడు రోజుల క్రితమే దంతెవాడ జిల్లాలోని బార్సూర్ సమీపాన ప్రెజర్‌బాంబు పేలగా కట్టెల కోసం వెళ్లిన ఓ గిరిజనుడు మృతి చెందాడు. మళ్లీ ఇలాంటి ఘటనే జరగడంతో అటు గిరిజనులు, ఇటు భద్రతా బలగాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి...

ఇల్లెందు: ఇల్లెందు – ఖమ్మంరోడ్డులో లలితాపురం ఐటీఐ సమీపంలో జాల విశాల్‌ను ఓ వాహనం ఢీకొట్టింది. విశాల్ తండ్రి ఉమాశంకర్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సూర్య కేసు నమోదు చేశారు.

కేసు నమోదు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ కాలనీకి చెందిన వ్యక్తి ఇంట్లో నగదు చోరీకి గురైనట్లు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. వారం రోజులుగా ఎస్‌ఆర్‌ఎస్‌కాలనీకి చెందిన ఓ కుటుంబం ఓ గుడిలో నిద్ర చేయాల్సి వచ్చింది. కార్యక్రమం పూర్తయ్యాక శుక్రవారం ఉదయం ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఇంటి తాళం పగలకొట్టి ఉండటాన్ని గమనించి బీరువాను తెరిచి చూడగా అందులో ఉండాల్సిన రూ.80 వేల నగదు కనిపించలేదు. శుక్రవారం సాయంత్రం ఇంటి యజమాని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్‌ఐ శివరామకృష్ణ కేసు నమోదు చేశారు.

దాడి చేశారని...

ఇల్లెందు: మండలంలోని సేవ్యాతండాకు చెందిన అంగోతు వీరన్నపై అదే గ్రామానికి చెందిన సురేశ్, కమల, లాలు, రూప్‌సింగ్, రాజేశ్వరి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.సూర్య కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి


ఫణికుమార్‌రెడ్డి (ఫైల్)

దమ్మపేట: గుండెపోటుతో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మృతి చెందారు. మండలంలోని గట్టుగూడెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం డి.ఫణికుమార్‌రెడ్డి.. గురువారం విధులు ముగించుకుని, సత్తుపల్లిలోని నివాసానికి చేరుకున్నాక గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు ఆయన్ను ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగానే కన్నుమూశారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ కీసర లక్ష్మి, నాచారం కాంప్లెక్స్ హెచ్‌ఎం జగపతయ్య, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు, యూటీఎఫ్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, రమేశ్‌కుమార్ శుక్రవారం హెచ్‌ఎం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ముందస్తు అరెస్టు

ఇల్లెందు: చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ వెళ్లేందుకు సన్నద్ధమవుతున్న ఏడుగురు ఆటోడ్రైవర్లను ఎస్‌ఐ బి సూర్య ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు.